క్యాబ్ బుక్ చేయడానికి ఓలా లేదా ఊబర్ యాప్ ఉపయోగిస్తే పికప్ లొకేషన్స్, గమ్యస్థానం చేరే టైమ్ వెంటనే డిస్‌ప్లే అవుతుంది. ఫేస్‌బుక్‌లో ఏదైనా పోస్ట్ చేయగానే ఫలానా ఫ్రెండ్స్‌ని ట్యాగ్ చేయాలా అని అడిగేస్తుంది. గూగుల్‌లో సెర్చ్ చేస్తుంటే అంతకు ముందు అదే సబ్జెక్టుపై జరిగిన సెర్చ్ లిస్ట్‌లను చూపించేస్తుంది. కోట్లమంది కస్టమర్ల నుంచి కొంతమందిని కొద్దిటైమ్‌లోనే డిస్కౌంట్ కూపన్లకు అర్హులుగా అమెజాన్ లాంటి ఆన్‌లైన్ ఈ-కామర్స్ సంస్థలు గుర్తించేస్తాయి. ఇవన్నీ... ఎలా జరుగుతున్నాయి? పెద్దఎత్తున ఉన్న డేటాను అత్యంత వేగంగా విశ్లేషించి అంతే స్పీడుతో నిర్ణయాన్ని ప్రకటించే ఆ యంత్ర శక్తి ఏమిటి? అదే మెషిన్ లర్నింగ్. ఇవన్నీ మనుషుల కంటే కొన్ని కోట్లరెట్ల సామర్థ్యంతో పనిచేసే మర ప్రజ్ఞ మహా మాయలే. ఇది ఇప్పుడు కొత్త కొత్త కోర్సులకు, ఎన్నో రకాల ఉద్యోగాలకు కేంద్రంగా మారుతోంది.

మర ప్రజ్ఞ మహా మాయ!

ఎమర్జింగ్ కెరియర్
మెషిన్ లర్నింగ్

నీలమేఘశ్యామ్ దేశాయ్
Career Dev.Cell
ACE ఇంజినీరింగ్ కళాశాల

మీ యాక్టివిటీస్ అన్నింటిపై మీ ఫేస్‌బుక్ అకౌంట్ ఎప్పుడూ ఒక కన్నేసి ఉంచుతుంది. తరచూ ఎవరి ప్రొఫైల్స్ చూస్తున్నారు, మీ అభిరుచులు ఏమిటి, ఏయే గ్రూప్‌ల్లో ఎలాంటి కంటెంట్ పోస్ట్ చేస్తున్నారు... వీటన్నింటినీ కనిపెట్టి మీ ఆసక్తులకు తగిన ఫ్రెండ్స్‌ని మీకు సూచిస్తుంది.

కొన్ని ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లలో లైవ్ ఎగ్జిక్యూటివ్‌లు కస్టమర్ల ప్రశ్నలకు టక టకా సమాధానాలు ఇచ్చేస్తుంటారు. ఆ జవాబులు ఇచ్చేది మనుషులు కాదు, చాట్‌బోట్.

అలాగే.. అడిగిన వెంటనే మన అవసరాలకు దాదాపు తగిన సమాచారాన్ని అందించే గూగుల్!

ఎప్పుడో ఒకసారి ఏమీ తోచక ఏదో వెబ్‌సైట్లో కావాల్సిన వస్తువు కోసం కాసేపు వెతికితే, దానికి సంబంధించి కొత్త సమాచారాన్ని తరచూ మెయిల్స్, మెసేజ్‌ల రూపంలో మోసుకొచ్చే టెక్నికల్ వ్యవస్థ!

ఇవన్నీ మెషిన్ లర్నింగ్ మాయలే.

మనుషుల ప్రమేయం లేకుండా ఒక కంప్యూటర్ ప్రోగామ్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని, సమస్యలకు సరైన సమాధానాలను కనిపెట్టగలిగే సామర్థ్యాన్ని సంతరించుకున్న సైన్స్ విజ్ఞాన విభాగాన్ని మెషిన్ లర్నింగ్ (మర ప్రజ్ఞ) అంటారు. నిర్ణయాలకు కావాల్సిన పూర్వపు డేటాను శోధించి, విశ్లేషించడానికి అవసరమైన శక్తిని ఈ ప్రోగ్రామ్‌లు కలిగి ఉండటం మెషిన్ లర్నింగ్ ప్రత్యేకత.

ఇలా కంప్యూటర్లు పనిచేయడానికి అవసరమైన అల్గారిథమ్ (క్రమసూత్ర పద్ధతి) రచన, నిర్మాణం, డెవలప్‌మెంట్‌లను చేయగలిగిన మెషిన్ లర్నింగ్ నిపుణుల అవసరం ఇప్పుడు వేగంగా పెరుగుతోంది.

ప్రతి దానికీ మనుషులు విడిగా ప్రోగ్రామ్‌లు రాసే అవసరం లేకుండా కంప్యూటర్లే స్వయంగా ప్రోగ్రామ్‌లను చేయడం మెషిన్ లర్నింగ్‌తో సాధ్యమవుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) రంగంలోని కంప్యూటేషనల్ లర్నింగ్ (గణన ప్రజ్ఞ), ప్యాటర్న్ రికగ్నిషన్ (రీతుల మాన్యత)ల మిశ్రమమే మెషిన్ లర్నింగ్ (మర ప్రజ్ఞ).

మర ప్రజ్ఞ రకాలు

మనకు కావాల్సిన ఫలితాల ఆధారంగా మెషిన్ లర్నింగ్ అల్గారిథమ్‌ను ప్రధానంగా మూడు రకాలుగా గుర్తించవచ్చు.

- సూపర్‌వైజ్‌డ్ లర్నింగ్ (పర్యవేక్షిత ప్రజ్ఞ)
- అన్-సూపర్‌వైజ్‌డ్ లర్నింగ్ (అపర్యవేక్షిత ప్రజ్ఞ)
- రీ-ఇన్‌ఫోర్స్‌డ్ లర్నింగ్ (ప్రబలిత ప్రజ్ఞ)

అంతరాలు తెలియాలి

మెషిన్ లర్నింగ్‌కి సంబంధించి ప్రధానంగా నాలుగు కొత్త పదాలు కనిపిస్తాయి. అవే డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లర్నింగ్. ఒకే భావాన్ని వేర్వేరు పదాల్లో చెప్పినట్లు అనిపించినా వీటి మధ్య అంతరాలు ఉన్నాయి. వాటిని తప్పనిసరిగా తెలుసుకోవాలి.

❑ డేటా సైన్స్‌లో ప్రధానంగా డేటా విశ్లేషణ ఉంటుంది. ఇందులో ఆర్ అనే ప్రోగ్రామింగ్ లాంగ్వేజిని ఉపయోగిస్తారు.

❑ మెషిన్ లర్నింగ్‌లో మనుషుల కన్నా కంప్యూటర్లు నడిపే ప్రోగ్రామ్‌లకు ప్రాధాన్యం ఉంటుంది.

❑ డీప్ లర్నింగ్ అంటే దృశ్య, శ్రవణ, పాఠ్య మాధ్యమాల్లోని డేటాను విశ్లేషించి, వర్గీకరణ చేసే మెషిన్ లర్నింగ్‌లోని ఉపరంగం. ఇది న్యూరల్ నెట్‌వర్క్ ఆర్కిటెక్చర్ మీద ఆధారపడి పనిచేస్తుంది.

❑ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది న్యూరల్ నెట్‌వర్క్స్, మెషిన్ లర్నింగ్, డీప్ లర్నింగ్‌లతో కూడిన కుటుంబానికి పెద్దలాంటిది. ఇది కంప్యూటర్లను మనుషుల్లా వివేకంతో కూడుకున్నవిగా అభివృద్ధి చేసే వ్యవస్థ.



ఏయే రంగాల్లో వినియోగం?

మెషిన్ లర్నింగ్ టెక్నాలజీ అనుపర్తన ఈ కింది రంగాల్లో రోజు రోజుకీ విస్తరిస్తోంది.

- ఇమేజ్ రికగ్నిషన్ - నలుపు, తెలుపు చిత్రాలు; రంగు చిత్రాల అక్షరాలను గుర్తించడం, ముఖాన్ని గుర్తించడం.
- స్పీచ్ రికగ్నిషన్ - మాటలు, ధ్వని గుర్తించడం.
- మెడికల్ డయాగ్నోస్టిక్స్ - వైద్యరంగంలో వ్యాధి లక్షణ పరిశీలన, రోగ నిర్ధారణ.
- ఫైనాన్షియల్ ఆర్బిట్రేజ్ - వ్యాపార రంగంలో వస్తు వినియోగ పద్ధతులు, అలవాట్లు, కొత్త ఆవిష్కరణలు, షేర్ మార్కెట్‌లలో పెట్టుబడి నిర్ణయాలు.
- క్లాసిఫికేషన్ - ఒకే రకమైన లక్షణాలు కలిగిన భిన్న సమూహాల వర్గీకరణ.
- బ్యాంకింగ్ వ్యవస్థ - రుణాల మంజూరీ నిర్ణయాలు, ఎగవేతదారుల ముందస్తు గుర్తింపు.
- ఇన్‌ఫర్మేషన్ ఎక్స్‌ట్రాక్షన్ - నిర్మిత, అనిర్మిత డేటా నుంచి ఉపయోగమైన సమాచారం వెలికితీత.
- విద్యారంగం - విద్యార్థుల గ్రాహ్య, వినిమయ శక్తి, పద్ధతుల గుర్తింపు.
- సెర్చ్‌ఇంజిన్ - గూగుల్ లాంటి సెర్చ్ ఇంజిన్ల వివేచన సామర్థ్యాన్ని పెంచడం.
- డిజిటల్ మార్కెటింగ్- వినియోగదారుల అభిరుచిని బట్టి ఉత్పాదకతకు ప్రాముఖ్యాన్ని వ్వడం, వ్యక్తిగత ఇష్టానిష్టాల గుర్తింపు.
- హెల్త్‌కేర్ - వైద్య ఆరోగ్య రంగం, ఆరోగ్య బీమా

శిక్షణనిచ్చే సంస్థల్లో కొన్ని!

ప్రభుత్వ సంస్థలు

✦ ఐఐటీ, బాంబే ✦ ఐఐటీ, మద్రాసు

✦ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, దిల్లీ ✦ ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ ✦ ట్రిపుల్ ఐటీ, బెంగళూరు

ప్రైవేటులో..

◆ కెర్నెల్‌స్కియర్ టెక్నాలజీస్, హైదరాబాద్

◆ మెషిన్ లర్నింగ్ ల్యాబ్, గచ్చిబౌలి, హైదరాబాద్ ◆ అనలిటిక్స్ పాత్, హైటెక్ సిటీ, హైదరాబాద్ ◆ డేటా సైన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ ట్రెయినింగ్, రామచంద్రాపురం, హైదరాబాద్ ◆ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్, గచ్చిబౌలి, హైదరాబాద్ ◆ అనలిటిక్స్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్, సోమాజిగూడ, హైదరాబాద్ ◆ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ ట్రెయినింగ్, రామచంద్రాపురం, హైదరాబాద్

ఆన్‌లైన్‌లో..

✤ కోర్స్‌ఎరా (మూడు కోర్సులు) ✤ ఉడాసిటీ (రెండు కోర్సులు) ✤ ఎడెక్స్ లర్నింగ్ (రెండు కోర్సులు) ✤ కార్నెజి మెల్లన్ యూనివర్సిటీ ✤ క్యాగ్‌ల్ ✤ కొల్లబెర టాక్ట్ ✤ జిగ్‌సా అకాడమీ ✤ ఎడ్వన్సర్ ఎడ్యువెంచర్స్ (edvancer eduventures) ✤ ఐవీ ప్రొఫెషనల్ స్కూల్ ✤ సింప్లీలర్న్ ✤ మైక్రోసాఫ్ట్ ఎంసీఎస్ఏ

'వి స్కిల్స్' అనే ప్రభుత్వ సంస్థ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ఇస్తుంది.

పెరుగుతున్న ఉద్యోగాలు

★ ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఫోర్బ్స్ అంచనాల ప్రకారం మెషిన్ లర్నింగ్ రంగంలో పేటెంట్ల సంఖ్య 2018లో దాదాపు 34% పెరిగింది.

★ మరో అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ అంచనాల ప్రకారం 2021 నాటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెట్టుబడులు 57 బిలియన్ డాలర్ల పైగానే ఉంటుంది.

★ అంతర్జాతీయ సంస్థ డెలాయిట్ అంచనాల ప్రకారం ఈ రంగంలో ప్రాజెక్టులు 2020 నాటికి నాలుగు రెట్లు పెరుగుతాయి.

★ కెల్లీఓసీజీ ఇండియా అంచనాల ప్రకారం మనదేశంలో 2018 నాటికి మెషిన్ లర్నింగ్‌లో ఉద్యోగావశాకాలు 60% వరకు పెరిగే అవకాశాలున్నాయి.

మొదట రూ. రెండు నుంచి రూ. నాలుగు లక్షల వరకు వార్షిక ఆదాయం లభిస్తుంది. తర్వాత అనుభవం, నైపుణ్యాలను బట్టి పారితోషికం క్రమంగా పెరుగుతుంది.

అభ్యర్థులకు అవసరమైన మెలకువలు

మెషిన్ లర్నింగ్ నేర్చుకోవడానికి అవసరమైన మెలకువలు, నైపుణ్యాలను రెండు వర్గాలుగా నిర్వచించవచ్చు. ఇది ఒక వ్యవస్థకు అవసరమైన, ఉపయోగకరమైన, సమగ్రమైన సమాధానాన్ని అందించే టెక్నాలజీ. కాబట్టి దాన్ని ఎక్కడ వినియోగిస్తారో తెలుసుకోవాలి. ఈ డొమెయిన్ నాలెడ్జ్‌ని మొదటి వర్గంగా పేర్కొంటారు. రెండో దాంట్లో సాంకేతిక నైపుణ్యాలు ఉంటాయి.

- కంప్యూటర్ సైన్స్ మౌలికాంశాలపై, ప్రధానంగా ప్రోగ్రామింగ్‌లో మంచి ప్రవేశం ఉండాలి. కంప్యూటర్ నిర్మాణానికి సంబంధించిన హార్డ్‌వేర్‌పై సరైన అవగాహన ఒక స్థాయి వరకు అవసరమవుతుంది.
- గణిత శాస్త్రంలోని సమితులు, ప్రమేయాలు, సంభావ్యత, గణాంక శాస్త్రం, క్రమసూత్రాల సంక్లిష్టతలు (సెట్స్, ఫంక్షన్స్, రిలేషన్స్, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, అల్గారిథమ్ కాంప్లెక్సిటీ)

తదితర పాఠ్యాంశాల్లో పట్టు ఉండాలి.

- డేటా మోడలింగ్, మూల్యాంకనాలను నేర్చుకోవాలి.
- మెషిన్ లర్నింగ్ కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన అపాచె సింగ, షోగన్, అపాచె మహూత్, అపాచె స్పార్క్ ఎంఎల్‌లిబ్, టెన్సర్‌ఫ్లో, ఓరిక్స్-2, అకార్డ్.నెట్, అమెజాన్ మెషిన్ లర్నింగ్, ప్రిడిక్షన్‌ఐఓ, ఎక్లిప్స్ డీప్ లర్నింగ్ వంటి టూల్స్, ఫ్రేమ్‌వర్క్స్‌లో ఒకటి కన్నా ఎక్కువ వాటితో పరిచయం ఉండాలి (కోచింగ్ సెంటర్లు వీటిలో కొన్నింటికి శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది).
- చివరగా సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ డిజైన్‌లలో కొంతమేరకు నైపుణ్యం అవసరం.

ఉత్తమ విద్య.. ఉన్నత బోధన!

केन्द्रीय विद्यालय संगठन

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల

ప్రతిభావంతులైన బోధనా సిబ్బంది, పరిపూర్ణ సౌకర్యాలు, పారదర్శక ఎంపిక.. ఇవీ కేంద్రీయ విద్యాలయాల ప్రత్యేకతలు. ఒకటో తరగతిలో ప్రవేశం దొరికితే ప్లస్‌టూ వరకు ప్రశాంతంగా ఉండవచ్చు. లక్షల రూపాయల ఖర్చు లేదు. నాణ్యమైన విద్యకు కొదవ లేదు. ప్రస్తుతం కేవీల్లో అడ్మిషన్లకు ప్రకటన వెలువడింది.

కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రవేశం అంత సులువుగా లభించదు. కానీ అడ్మిషన్ల కోసం ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది కాబట్టి ఒకటో తరగతిలో ప్రవేశానికి తల్లిదండ్రులు ప్రయత్నం చేయవచ్చు. మిగిలిన తరగతుల్లో ప్రవేశాలు మాత్రం ఖాళీ సీట్లు ఉంటేనే లభిస్తాయి.

ప్రవేశ విధానం

ఒకటో తరగతిలో 40 సీట్లు ఉంటాయి. వీటిలో 25 శాతం లాటరీ విధానంలో భర్తీ చేస్తారు. సంబంధిత కేంద్రీయ విద్యాలయానికి దరఖాస్తు చేసుకున్న అందరినీ లాటరీలోకి తీసుకుంటారు. 15 శాతం అంటే 6 సీట్లు ఎస్సీలకు, 7.5 శాతం అంటే 3 ఎస్టీలకు కేటాయించారు. రెండు సీట్లు సింగిల్ గర్ల్ చైల్డ్ (ఒకే కుమార్తె కలిగి ఉన్న తల్లిదండ్రులు)కు లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. దివ్యాంగులకు 3శాతం సీట్లు ఉంటాయి. రెండో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్న ఖాళీలకు అనుగుణంగా ప్రవేశాలు కల్పిస్తారు. వీటికి కూడా లాటరీ విధానాన్నే అనుసరిస్తారు. 9, 11 తరగతుల్లో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తారు.

వీరికి ప్రాధాన్యం

సీట్ల కేటాయింపులో డిఫెన్స్, పారా మిలటరీలో పనిచేస్తున్న పిల్లలకు మొదటి ప్రాధాన్యం లభిస్తుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పిల్లలకు ద్వితీయ ప్రాధాన్యం లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ సెక్టార్ కంపెనీలు, స్వయంప్రతిపత్తి సంస్థలు...మొదలైన చోట్ల పనిచేసే ఉద్యోగుల పిల్లలకూ ఆ తర్వాతి ప్రాధాన్యం లభిస్తుంది. ప్రతి ఎంపీ (లోక్‌సభ) తన పరిధిలోని కేంద్రీయ విద్యాలయానికి ఏడాదికి పది మందిని సిఫార్సు చేయవచ్చు. రాజ్యసభ సభ్యులైతే వారు ప్రాతినిధ్యం వహిస్తోన్న రాష్ట్రం పరిధిలో ఉన్న కేవీలకు సిఫార్సు చేయవచ్చు. ఇలా ఎంపీలు ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలను కేవీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి ఆయా కేవీలకు అనుమతి పత్రాలు వస్తే సీట్లను కేటాయిస్తారు. అలాగే కేంద్ర మానవ వనరుల శాఖ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతోద్యోగులు, రిసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్...తదితర విభాగాలవారీ సీట్ల కోటా ఉంటుంది.

ముఖ్యమైన తేదీలు

ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 19 (సాయంత్రం 4 గంటలు)

రెండు, ఆపైన తరగతుల్లో ప్రవేశానికి ఏప్రిల్ 2 నుంచి ఏప్రిల్ 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్లస్ వన్‌లో ప్రవేశానికి పదో తరగతి బోర్డు ఫలితాలు వెలువడిన పది రోజుల తర్వాత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

వెబ్‌సైట్: http://kvsangathan.nic.in

దరఖాస్తు విధానం

ఒకటో తరగతిలో ప్రవేశానికి విద్యార్థి వయసు మార్చి 31, 2018 నాటికి అయిదేళ్లు పూర్తికావాలి (ఏప్రిల్ 1 నాటికి పూర్తయినా పరిగణనలోకి తీసుకుంటారు) అలాగే ఏడేళ్లకు మించకూడదు. దరఖాస్తు చేసుకోవడానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత లాగిన్ అయి వివరాలు అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు చేసుకునేటప్పుడే చేరాలనుకుంటున్న మూడు కేవీలను ప్రాధాన్య క్రమంలో నమోదు చేయాలి. ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు చేసుకుంటే చివరి దరఖాస్తునే పరిగణనలోకి తీసుకుంటారు.

ఫీజు వివరాలు

విద్యా హక్కు చట్టం ద్వారా ప్రవేశాలు పొందినవారు ప్లస్ టూ వరకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన పనిలేదు. వీరికి పాఠ్యపుస్తకాలు, నోట్సులు, యూనిఫారం, పాఠశాలకు రావడానికి ప్రయాణ ఖర్చులు సైతం చెల్లిస్తారు. బాలికలు ఎలాంటి ట్యూషన్ ఫీజు చెల్లించనవసరం లేదు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని ఇద్దరు పిల్లల వరకు ఫీజు మినహాయింపు ఉంది. ఎస్సీ, ఎస్టీ బాలబాలికలకు ఫీజు లేదు. 9, 10 తరగతులకు బాలురు నెలకు రూ.200 ఫీజు కట్టాలి. 11, 12 తరగతులకు కామర్స్, హ్యూమానిటీస్ కోర్సులైతే రూ.300, సైన్స్ కోర్సులకు రూ.400 చెల్లించాలి. కంప్యూటర్ తరగతులు ఉంటే అన్ని విభాగాల విద్యార్థులూ నెలకు రూ.వంద చొప్పున చెల్లించాలి. విద్యాలయ వికాస నిధి కోసం రూ.500 చొప్పున అందరూ చెల్లించాలి. సైనికోద్యోగులు, మాజీ సైనికోద్యోగుల పిల్లలకు ఫీజు మినహాయింపు లభిస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగాలు

నాబార్డ్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

సంస్థ: నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్), ముంబయి.

పోస్టు-ఖాళీలు: అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఎ (రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంకింగ్ సర్వీస్)- 92.

అర్హత, వయసు, ఎంపిక: సంస్థ నిబంధనల ప్రకారం. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

ఆన్‌లైన్ దరఖాస్తు: 13.03.2018 నుంచి 02.04.2018 వరకు.

వెబ్‌సైట్: www.nabard.org

ఎన్‌సీఆర్ ప్లానింగ్ బోర్డులో కన్సల్టెంట్లు

సంస్థ: నేషనల్ కేపిటల్ రీజియన్ ప్లానింగ్ బోర్డు, న్యూదిల్లీ.

పోస్టు-ఖాళీలు: ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ (ప్లానింగ్)- 10. **అర్హత:** ప్లానింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ లేదా పీజీ, పని అనుభవం ఉండాలి.

వయసు: 30 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు: ఆఫ్‌లైన్. **చివరి తేదీ:** 31.03.2018. **వెబ్‌సైట్:** ncrpb.nic.in

ప్రవేశాలు

టీఎస్ ఎల్పీసెట్-2018

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఐఏఎస్ఈ/ సీటీఈ/ ప్రైవేట్ పండిట్ ఇన్‌స్టిట్యూషన్లలో భాషా పండిట్ శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి పరీక్ష.

కోర్సులు: తెలుగు పండిట్ శిక్షణ, హిందీ పండిట్ శిక్షణ, ఉర్దూ పండిట్ శిక్షణ.
అర్హతలు: సంబంధిత సబ్జెక్టులో బీఏ లేదా ఎంఏ.
ఎంపిక: ప్రవేశ పరీక్ష ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు: 28.03.2018 నుంచి 19.04.2018 వరకు.
వెబ్‌సైట్: lpcet.cdse.telangana.gov.in

నన్నయ సెట్-2018

రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో పీజీ ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. **కోర్సులు:** ఎంఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంఈఎడీ, ఎంపీఈడీ. **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ. **చివరి తేదీ:** 14.04.2018. **పరీక్షల ప్రారంభ తేదీ:** 07.05.2018.
వెబ్‌సైట్: www.aknudoa.in

డీఐఏటీలో పీజీ ప్రోగ్రాం

పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలో పీజీ ప్రవేశాలు. **కోర్సులు:** ఎంటెక్, ఎంఎస్సీ, పీజీ డిప్లొమా, ఎంఎస్.
అర్హతలు: బీఈ/ బీటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణత.
ఎంపిక: గేట్ స్కోర్ ఆధారంగా.
చివరి తేదీ: 13.04.2018. **వెబ్‌సైట్:** www.diat.ac.in

నోటీస్ బోర్డు

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.